డిప్యూటీ మేయర్‌ను కలిసిన జలమండలి సెక్షన్ మేనేజర్



లాలాపేట: లాలాపేట జలమండలి సెక్షన్ మెనేజర్‌గా ఇటీవల నూతనంగా బదిలీపై వచ్చిన నజీమా బేగం గురువారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్‌లో తాగు నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని డిప్యూటీ మేయర్ ఈ సందర్భంగా ఆమెకు సూచించారు.







బీఆర్ఎస్ నేతల నిరసన గళం

సీఎం వ్యాఖ్యలపై పలుచోట్ల నిరసన



నిరసన ప్రదర్శన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు



అడ్డగుట్టలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ నేతలు

సికింద్రాబాద్: మహిళల పట్ల అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వాఖ్యలు చేశారంటూ గురువారం బీఆర్ఎస్ నాయకులు సీతాఫల్‌మండి కూడలిలో నిరసన ప్రదర్శన చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, ఐదు డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేల పట్ల సీఎం చేసిన వాఖ్యలు సిగ్గుచేటుగా ఉన్నాయన్నారు. ఇందుకు ప్రతిగా వచ్చే ఎన్నికల్లో మహిళలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీఎం దిష్టి బొమ్మను దగ్ధం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు చేసిన ప్రయత్నాలను చిలకలగూడ పోలీసులు భగ్నం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, బీఆర్ఎస్ నాయకులు ఆలకుంట హరిబాబు, సునీల్‌ముదిరాజ్, నాగేశ్వర్‌రావు, రాజేశ్, శ్రీకాంత్, అశ్విన్‌కుమార్, వంజర సతీష్‌కుమార్, యాద క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్: బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిలను అవమానపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను యావత్ సమాజం ఖండించాలని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి అన్నారు. మహిళా లోకాన్ని కించపరిచే విధంగా వాఖ్యలు చేయడం సరికాదన్నారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి హోదాలో ఉండి మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం యావత్ తెలంగాణ సమాజం హర్షించదన్నారు. వెంటనే సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అడ్డగుట్ట: మహిళ ఎమ్మెల్యేలను అవమానపరిచే విధంగా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. గురువారం అడ్డగుట్టలోని చంద్రయ్య హోటల్ వద్ద బీఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి మహిళా ఎమ్మెల్యేలను కించ పరిచే విధంగా మాట్లాడడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. అహంకారపూరితంగా నిండు సభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డికి ప్రజలే గుణపాఠం చెబుతార్నన్నారు. అనంతరం, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, మనోహర్, వసంత, మహ్మద్, ఎల్లయ్య, గౌస్, అమర్, రాజు, మల్లేష్, దేవయ్య, కిట్టు, రామప్ప, శ్రీరామ్, ప్రవీణ్, గోపి, శంకర్, మహేశ్వరి, రమా, శారద, రజిని తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల కల సాకారమైంది

వర్గీకరణ తీర్పుపై పలుచోట్ల హర్షం

బౌద్ధనగర్: సుప్రీం కోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడం ఎంతో సంతోషకరమైన విషయమని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున్ పేర్కొన్నారు. గురువారం పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దప్పు మల్లికార్జున్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాల పోరాటం విజయవంతమైందన్నారు. నాయకులు తిప్పారపు లక్ష్మణ్; టీవీ నరసింహరావు, వీఎస్. రాజు, విష్ణు, విజయరావు, వాసు, అరుణ్, శివప్రసాద్, శివ పాల్గొన్నారు.



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అడ్డంకులు తొలగిపోయాయి

అమీర్‌పేట: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ధళిత సంఘం నాయకులు అన్నారు. ఉప వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని గురువారం సుప్రీం కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో బల్కంపేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పలువురు నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. చాలా కాలంగా వర్గీకరణ కోసం పోరాడుతూ వచ్చామని, సుప్రీం తీర్పుతో అడ్డంకులు తొలిగిపోయాయని నాయకులు రామేశ్వరం రమేష్ అన్నారు.



మహనీయుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు

సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

కంటోన్మెంట్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునివ్వడం మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ పోరాటానికి దక్కిన ఫలితమే అని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇంచార్జ్ ఇటుక శ్రీకిషన్ మాదిగ అన్నారు. ఎమార్పీఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గం పరిధిలోని బోయిన్‌పల్లి మార్కెట్ చౌరస్తా, పికెట్ చౌరస్తా, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విజయోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మందకృష్ణ చిత్రపటాలతో ఊరేగింపుగా విజయోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో మంద మధుకర్ మాదిగ, అజిత్ కళ్యాన్ వాల్మీకి, బ్యాగరి నర్సింహ, పరుశరామ్, జైనపల్లి శ్రీకాంత్, గుండాల జగదీష్, కే. రాజు, బాబేందర్, శ్రీకాంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు అభినందనీయం

సికింద్రాబాద్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అభినందనీయమని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడానికి కృషి చేస్తున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు ఆది నుంచీ బీజేపీ అండగా నిలిచిందన్నారు.

ఓయూలో వర్గీకరణ సంబరాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఎస్సీ వర్గీకరణకు సుప్రీమ్ కోర్టు అనుకూల తీర్పుతో విద్యార్థులు, అధ్యాపకులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి నేతృత్వంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట స్వీట్లు పంచారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



లాలాపేట: మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నల్లపోచమ్మ దేవాలయంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ మహిళా సభ్యురాళ్లు అందరూ భక్తి శ్రద్ధలతో బోనాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు జైనందన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు



సికింద్రాబాద్: వివిధ రూపాల్లోని అమ్మవార్లకు పలువురు మహిళలు ఆషాఢమాసం బోనాలు సమర్పించుకుంటున్నారు. గురువారం పలువురు సీతాఫల్‌మండికి చెందిన మహిళలు చిలకలగూడ కట్టమైసమ్మ, ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ లకు బోనాలు సమర్పించుకున్నారు. బోనాల సమర్పనలో సీతాఫల్‌మండి కార్పోరేటర్ సామల హేమ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ సమస్యలు పరిష్కరించండి

డిఫెన్స్ ఎస్టేట్స్ ఉన్నతాధికారులకు రామకృష్ణ విజ్ఞప్తి



డీజీడీఈ రాజేశ్వర్‌ను వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, డిఫెన్స్ ఎస్టేట్స్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ ఎస్టేట్స్ (డీజీడీఈ) టి. రాజేశ్వరన్, అడిషనల్ డీజీ సోనమ్ యాంగ్డోల్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు సంబంధించి సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ముఖ్యంగా పెండింగ్ సర్వీసు చార్జీలు విడుదల చేయాలని, నూతన బిల్డింగ్ బైలాస్‌కు ఆమోదం తెలపాలని కోరామన్నారు. బీఆర్ఎస్, బీపీఎస్ పథకాలు కంటోన్మెంట్‌లో అమలయ్యేలా చూడాలన్నారు. భూబదలాయింపు ద్వారా ఏ-1, బీ-4 స్థలాల్లో వెలిసిన బస్తీవాసులకు పునరావాసం కల్పించాలన్నారు. రక్షణ భూముల సమీపంలో ఉన్న దేవాలయాలు, ఇతర మతపరమైన ప్రార్థనాలయాలకు వెళ్లేందుకు అనువైన మార్గాలు కల్పించాలని అడిగామన్నారు. ఎస్ఆర్‌డీపీ ద్వారా కంటోన్మెంట్ పరిధిలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌లకు రోడ్డు విస్తరణను 200 ఫీట్‌ల నుంచి తగ్గించాలని కోరామన్నారు.

కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మాంగ్ కులస్తులకు కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివ రావు అన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో మాంగ్ సమాజ్ తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ అన్నాభావు సాతే 104వ జయంతి జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు గైక్వాడ్ తులసీదాస్ మాంగ్ అధ్యక్షత వహించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ.. మాంగ్‌ల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళతానన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఏకాగ్రతతో పనిచేయాలి

కంటోన్మెంట్: రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు ఏకాగ్రతతో పనిచేయాలని నార్త్‌జోన్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పగడాల అశోక్ కుమార్ అన్నారు. ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖుస్రోషాఖాన్ ఆహ్వానం మేరకు కంటోన్మెంట్ డిపోలో నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 30 ఏళ్ల నుంచి డ్రైవర్‌గా ఎలాంటి ప్రమాదాలు లేకుండా డ్రైవింగ్ చేసిన 14 మంది డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్ఎంలు కవిత, సురేశ్ చౌహాన్, బీమ్ రెడ్డి, డిపో మేనేజర్‌లు సుధాకర్ రావు, హరి, మురళీధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న అధికారులు



ఉత్సాహంగా సెయింట్ ఫ్రాన్సిస్ ఫ్రెషర్స్ డే



సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా జరిగాయి. 'ఫ్లోరల్ ఫియాస్టా' అనే థీమ్‌తో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా వివిధ రకాల ఈవెంట్లతో విద్యార్థులు అబ్బురపరిచారు. తమ గాత్రంతో శ్రావ్యానందాన్ని కలిగించారు. నృత్య ప్రదర్శనలతో హోరెత్తించారు. ఫ్యాషన్ డిజైనర్లు సమంతాజైన్, దీక్షాబూరుగులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ప్రకటించారు.

యువత కష్టపడేతత్వాన్ని అలవాటు చేసుకోవాలి

రాంగోపాల్‌పేట్: యువత, విద్యార్థులు కష్టపడేతత్వాన్ని అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని మాజీ రాజ్యసభ సభ్యులు మురళీ మోహన్ అన్నారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు యువతీ యువకులకు నిర్వహించే ఉపాధి మార్గాలు, నైపుణ్యాల శిక్షణా కార్యక్రమం గురువారం హరిహరకళాభవన్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కష్టపడే మనస్తత్వంతోనే తాను ఎవరి అండదండలు లేకున్నా ఈ స్థాయికి చేరుకున్నానని అన్నారు. సినీ నటుడు ప్రదీప్, సుదీప్ సంద్ర, స్వామి బోధానందమయ, గంప నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా కిలో రూ.27, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 48, పందిరిబీర 40, క్యాబేజీ 23, క్యారెట్ 37, దొండ 40, గుండుబీన్స్ 70, గింజ చిక్కుడు 75, గోకరకాయ 40, కీర 28, దోసకాయ 16, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 60, కందగడ్డ 50, సొరకాయ 13, పొట్లకాయ 15, అరటికాయ 11, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సంతకాల సేకరణ



అడ్డగుట్ట: నగరంలో ట్రాఫిక్, కాలుష్య సమస్య పరిష్కారం కోసం ప్రజా రవాణాను పెంచాల్సిన అవసరం ఉందని సీపీఎం నాయకులు అన్నారు. గురువారం తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ హైద్రాబాద్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదే స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదన్నారు. దీంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ రద్దీ, కాలుష్య సమస్యలతో తీవ్రంగా సతమతమౌతున్నారన్నారు. నగరంలో ఎక్కువమంది ప్రయాణించే బస్సులు, రైళ్లను పెంచితేనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సీపీఎం నాయకులు అజయ్‌బాబు, ఆర్. మల్లేష్, డానియల్, నవీన్, ప్రేమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ గుడి నిర్మాణానికి సహకరించాలి

లాలాపేట: నల్లపోచమ్మ గుడి పునర్నిర్మాణానికి రైల్వే అధికారులు సహకరించాలని డాక్టర్ అంబేద్కర్‌నగర్ (ఇసుకబాయి) అధ్యక్షులు గంథమల్ల రాజలింగం కోరారు. గురువారం బస్తీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తమ బస్తీలో అమ్మవారి గుడిని పునర్నిర్మిస్తుండగా రైల్వే అధికారులు అడ్డుకుని నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లారన్నారు. బస్తీ వాసులమంతా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి తమ సమస్యను విన్నవిస్తామని తెలిపారు.

అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: నా చావుకు ఎవరూ కారణం కాదు, నేనే బాధ్యుడిని.. చేసిన అప్పులతో చనిపోతున్నాను అంటూ ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాసి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. పద్మారావునగర్‌లో నివాసం ఉండే ఉమ్మగోని లలిత్‌గౌడ్ (24) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సికింద్రాబాద్ ఆర్పీరోడ్‌లోని ఓయో టౌన్‌హౌజ్‌లో బస చేశాడు. సెల్ఫీ వీడియో తీసుకుని సూసైడ్ నోట్ రాసి రూములో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హోటల్ సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

